క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పామూరు: మండలంలోని బొట్లగూడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జిలానీ తెలిపారు. 167బీ జాతీయ రహదారిపై విద్యుత్‌లైన్ల మరమ్మతులు, నూతన లైన్ ఏర్పాటు దృష్ట్యా సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మరో 10 రోజుల పాటు ప్రతిరోజు 2 నుంచి 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

పీసీపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ సంజీవరావు అన్నారు. మండల పరిధిలోని తలకొండపాడు సమీపంలో సచివాలయం వద్ద నాటిన మొక్కలను బుధవారం పరిశీలించారు. వసతికి వందనం కింద ఉద్యానవన శాఖ కింద ముగ్గురు రైతులకు మంజూరైన 75 మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా సరైన సమయంలో వర్షాలు కురుస్తాయన్నారు. ఏపీఓ సుబ్బారావు, వీసీ సత్యనారాయణ, టీఏ కేవీరెడ్డి, ఎఫ్ఈ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రేడ్ల పొగాకుకు మంచి ధర


వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: వ్యాపారులు అన్ని గ్రేడ్ల పొగాకుకు మంచి ధర అందించాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక వేలం కేంద్రంలో బుధవారం రైతులు, వ్యాపారులతో చర్చించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రానికి చిరుకూరపాడు గ్రామ రైతులు 614 బేళ్లను వేలాని తీసుకురాగా 548 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.321, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.253.91 పలికింది. వేలంలో మొత్తం 37 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

3 ఇసుక ట్రాక్టర్లు సీజ్


చింతలపాలెంలో సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహసీల్దార్ చక్రవర్తి ఆదేశాలతో సీజ్ చేసినట్లు ఆర్ఐ రమణయ్య తెలిపారు. వీఆర్ఓలు, వీఆర్ఏలు, పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి ట్రాక్టర్లను సీజ్ చేసి జరుగుమల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఆర్ఐ వివరించారు. తనిఖీలో వీఆర్ఓలు బి.శ్రీను, రామారావు, రాకేష్, మధు, చైతన్య, నహేమియా పాల్గొన్నారు.

విద్యార్థులకు పరుగు పందెం పోటీలు


విద్యార్థులకు పరుగుపందెం పోటీలు

ఉలవపాడు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం 100 మీటర్ల పరుగుపందెం పోటీలు నిర్వహించారు. మొత్తం 46 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థుల సృజనాత్మక శక్తిని బయటకు తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా విద్యార్థులతో చిన్నపిల్లల కథలు, సైన్సు, విజ్ఞాన పుస్తకాలు చదివించారు. గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు వేమయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు

రాచర్ల: మండలంలోని చోళ్లవీడులో వేమయ్య స్వామి 262వ ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయాల కార్యానిర్వాహకులు బుధవారం తెలిపారు. వేమయ్యస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా 31వ తేదీ శుక్రవారం సాయంత్రం కులశ గ్రామోత్సవం, జూన్ 1వ తేదీన శనివారం ఆలయంలో తెల్లవారు జామున 4 గంటలకు గణపతి పూజ, అభిషేకం, ఆఖండస్థాపన, అంకురారోపణం, మండల అవాహము కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

- ఆర్డీఓకు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందచేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: కొండవాగు పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించి కనిగిరి నాగుల చెరువులో వర్షం నీటిని చేరకుండా అడ్డుకుంటున్న గ్రానైట్, రియల్టర్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్‌కు ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందచేశారు. కనిగిరికి ప్రధాన నీటి వనరుగా ఉన్న నాగుల చెరువులోకి నీరు చేరకుండా గ్రానైట్, ఫ్యాక్టరీ వ్యాపారులు, రియల్టర్లు ఆక్రమణలకు పాల్పడి, కొండ వాగును ఆక్రమించినట్లు వివరించారు. దీంతో కొండపై నుంచి వచ్చే వర్షం నీరు కాలువల్లో గుండా నాగుల చెరువులోకి చేరకుండా ఆగిపోతున్నాయన్నారు. కొందరు గ్రానైట్ వ్యాపారులు భారీ రాళ్లను వాగు అడ్డంగా వేశారని ఆరోపించారు. వర్షం నీరు వాగులో నుంచి చెరువులోకి చేరితే పట్టణంలో భూగర్భ జలాలు పెరుగుతాయని, బోర్లల్లో నీరు చేరుతాయన్నారు. ఫలితంగా పట్టణంలోని నీటి సమస్య తగ్గుతుందని వివరించారు. తక్షణం రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులతో, రియల్టర్, గ్రానైట్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి ఆక్రమితదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాసవీ సత్రసముదాయాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, బాలాజీ, బొట్టు శ్రీనివాసులనాయుడు, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

క్లీన్, గ్రీన్ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి



సీఎస్‌పురంలో మాట్లాడుతున్న డీపీఓ ఉషారాణి

సీఎస్‌పురం(పామూరు): పంచాయతీ కార్యదర్శులు మెరుగైన పారిశుధ్యంతో క్లీన్, గ్రీన్ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని డీపీఓ టి.ఉషారాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో బుధవారం సాయంత్రం ఎంపీడీఓ జి.కృష్ణయ్య అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ మురికినీటి కాల్వల్లో నీరు నిల్వలేకుండా చేయించడం, కాల్వల్లో వ్యర్థాలు లేకుండా చేయించడం వంటి పనులకు ప్రాధాన్యం ఇచ్చి మెరుగైన పారిశుధ్యం ఉండేలా చూడాలన్నారు. నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయించాలన్నారు. పంచాయతీల విద్యుత్ చార్జీల బకాయిలు లేకుండా చూడాలని, సేవలకు సంబంధించిన నగదును ప్రభుత్వ ఖాతాలో ఎప్పటికప్పుడు జమచేయాలన్నారు. మంచినీటి ట్యాంకులు, బావుల్లో క్లోరినేషన్ చేయించాలని సూచించారు. క్లాప్‌మిత్ర వేతనాలకు సంబంధించిన వివరాలను సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర షెడ్ల నిర్వహణ సరిగా నిర్వహించేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమయపాలన పాటించి బయోమెట్రిక్ వేయడంతో పాటు విధిగా యూనిఫాం ధరించాలన్నారు. ఈఓపీఆర్‌డీ కె.సుందరరామయ్య, సచివాలయాల పీఎస్‌లు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు


డిపోలోని పెట్రోల్ బంక్‌ను పరిశీలిస్తున్న సుధాకర్‌బాబు

కనిగిరి రూరల్: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించాలని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి బి. సుధాకర్ బాబు అన్నారు. కనిగిరి డిపోను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డిపోలోని మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, అత్యవసరాలకు నీటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డిపోలోని అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. బస్సు సర్వీసులు, కార్గో సర్వీసులు పనితీరును అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. తొలుత డిపో ఆవరణలో నిర్మాణంలో ఉన్న పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. డిపో మేనేజర్ బి. శివన్నారాయణ, అసిస్టెంట్ మేనేజర్ చిన్నయ్య సూరి, రమణమ్మ, ప్రసాద్, రాణి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

గుడ్లూరు: ఉపాధి హామీ పనులపై స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏపీఓ అబ్దుల్లా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా కాస్తున్నందున్న కూలీలు ఉదయం 6 గంటలకే పని ప్రదేశాలకు చేరుకొని 10 గంటలు వరకు పనులు చేయాలన్నారు. కూలీలకు ఇబ్బందులు కలగకుండా మంచినీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేసుకుంటే కూలీలకు రోజుకు రూ.300 కూలీ పడుతుందన్నారు. మస్టర్లలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. పనులను టెక్నికల్ అసిస్టెంట్‌లు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలన్నారు. ఉద్యానవన పంటలను ఎక్కువగా సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

టంగుటూరులో కార్డన్ సెర్చ్


టంగుటూరులో సీజ్ చేసిన వాహనాలతో సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సైలు

టంగుటూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్ హెచ్చరించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వెనుక వైపు ఉన్న పాతుల చెంచయ్య కాలనీలో సీఐ దాచేపల్లి రంగనాథ్ ఆధ్వర్యంలో టంగుటూరు, జరుగుమల్లి ఎస్సైలు పున్నారావు, వెంకటేశ్వరరావు, సిబ్బంది బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు


మాట్లాడుతున్న సర్దార్ పాపారాయుడు

కందుకూరు: విద్యార్థి దశ నుంచే సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే లక్ష్యాన్ని సాధించడంతో పాటు, జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ప్రముఖ మోటివేటర్ డాక్టర్ జె.సర్దార్ పాపారాయుడు అన్నారు. 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మాదిగ విద్యార్థుల అభినందన సభ మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఆదియేంధ్ర కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని సూచించారు. చదువును మధ్యలోనే ఆపివేయవద్దని, ఎన్ని కష్టాలు వచ్చినా ఉన్నత చదువులు చదివేందుకు కృషి చేయాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతీరావుపూలే వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన 36 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య డివిజన్ అధ్యక్షుడు జడ రాములు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రిటైర్డు డీఈఓ బొమ్మల యానాదయ్య, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉచ్చులూరి నిరంజన్, గౌరవ సభ్యులు చదలవాడ నాగభూషణం, మండల అధ్యక్షుడు చదలవాడ కోటేశ్వరరావు, ప్రధానకార్యదర్శి తలారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు


గుడ్లూరు గ్రంథాలయంలో కథల పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

కొండపి(సింగరాయకొండ): ప్రతి విద్యార్థి వేసవి శిక్షణలో భాగంగా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కొండపి గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయం ఒక పుస్తక బాండాగారమని, ప్రతి విద్యార్థి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం ప్రతి ఒక్కరినీ సన్మార్గంలో నడిపి, మంచి ప్రవర్తనను తీసుకొస్తుందని తెలిపారు. విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో క్యారమ్స్, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. శిక్షణలో 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

గుడ్లూరు: స్థానిక ఎర్రన గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కథల్లో ఉన్న నీతిని గ్రహిస్తే విద్యార్థులు సమాజంలో మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు. 20 మంది విద్యార్థులు కథల పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తక పఠనం, యోగా, ఆరోగ్య సూత్రాల గురించి వివరించారు.

ఆక్రమణలు తొలగించాలి


బొట్లగూడూరులో జెంక్షన్ సెంటర్లో తొలగించాల్సిన ఆక్రమణలు

పామూరు: మండలంలోని బొట్లగూడూరు జంక్షన్ వద్ద ఆక్రమణలు తొలగించి జంక్షన్ ఏర్పాటు చేసిన తరువాతే జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని బొట్లగూడూరు గ్రామస్తులు కోరుతున్నారు. మైదుకూరు నుంచి సింగరాయకొండ వరకు నూతనంగా నిర్మిస్తున్న 167బీ జాతీయ రహదారి మండలంలోని బొట్లగూడూరులో కూడలి నుంచి పోతుంది. కాగా కూడలి వద్ద నుంచి ఒకవైపు కంబాలదిన్నె, మరోవైపు పెద ఇర్లపాడు రోడ్డు మరోవైపు పామూరుకు, మరో వైపు కందుకూరు రోడ్డు ఉంది. కూడలిలో పూర్తిస్థాయిలో ఆక్రమణలు ఉండగా వాటిని తొలగించకుండా, జంక్షన్ హద్దులు ఏర్పాటు చేయకుండా, అక్కడ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకుండా కొంతదూరం పనులు వదలివేసి ఆ తరువాత పనులు చేపట్టడం ఏంటని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతాయని గ్రామస్తులు పేర్కొన్నారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణం జంక్షన్ హద్దులు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని, ప్రమాదాలు జరగకుండా నివారించాలని బొట్లగూడూరు గ్రామస్తులు కోరుతున్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ చంద్రారెడ్డి

ఉలవపాడు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాన్ని తహశీల్దార్ చంద్రారెడ్డి బుధవారం పరిశీలించారు. వేసవి కాలం నేపథ్యంలో విద్యార్థులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. పరీక్షలు జరుగుతున్న తీరు, హాజరుశాతం, రికార్డులు పరిశీలించారు. డీటీ వీరయ్య, ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు ఉన్నారు.

కొలతల ప్రకారమే బిల్లుల చెల్లింపులు


కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీలకు కొలతల ప్రకారమే బిల్లులు చెల్లింపులు జరగుతాయని ఏపీఓ వెంకటేశ్వర్లు అన్నారు. హనుమంతునిపాడులో జరుగుతున్న కుంట పూడికతీత పనులు బుధవారం పరిశీలించారు. ముందుగా కూలీల హాజరు, చేస్తున్న పనులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన కొలతలు తప్పకుండా చేయాలన్నారు. కొలతల ప్రకారమే బిల్లులు చెలింపులు ఉంటాయన్నారు. ఇచ్చిన కొలతలు చేసిన గిట్టుబాటు కూలి వస్తుందన్నారు. జాబ్ కార్డున్న వారికి పని లేదనకుండా కల్పించాలని సూచించారు.

1న మండల సమావేశం

హనుమంతునిపాడు: మండల సర్వసభ్య సమావేశం జూన్ ఒకటిన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.లలిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


గుడ్లూరు భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ గోవర్ధన్

గుడ్లూరు: ప్రత్యేక అవసరాలు చిన్నారులను తల్లిదండ్రులు భవిత కేంద్రంలో చేర్పించి సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ-2 గోవర్ధన్ అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఐఈఆర్పీలు ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించడానికి సర్వే నిర్వహిస్తారన్నారు. గుర్తించిన చిన్నారుల వివరాలను నమోదు చేసుకొని భవిత కేంద్రంలో చేర్పిస్తామన్నారు. ఈ కేంద్రంలో చేరిన విద్యార్థులకు వారి మానసిక అవసరాలను బట్టి బోధనా అభ్యసన సామగ్రి, ఉపకరణాలు ద్వారా విద్య అందిస్తామని తెలిపారు. భవిత కేంద్రానికి వచ్చే విద్యార్థులకు రవాణా ఎస్కార్ట్, రీడర్ చార్జీలు, అలవెన్స్‌లు అందిస్తామన్నారు. జూన్ 9వ తేదీ లోగా సర్వేను పూర్తి చేసి వివరాలను అందచేయాలని ఐఈఆర్పీలకు ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు శరత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వర ఆలయానికి రూ.50,116 విరాళం


ఆలయం కమిటీ సభ్యులకు విరాళం అందచేస్తున్న వెంకట్రావు

గుడ్లూరు: గుడ్లూరులో నూతనంగా నిర్మిస్తున్న నీలకంఠేశ్వర ఆలయానికి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ వెంకట్రావు రూ.50,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందచేశారు. పురాతన నీలకంఠేశ్వర ఆలయం శిథిలావస్థకు చేరడంతో తొలిగించి ఆలయ పునఃనిర్మాణం చేపట్టారు. నూతన ఆలయ నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు అందచేస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు సోమానాయుడు, వెంకటేశ్వరరాజు, సుధాకర్, ఆలయ పూజారి లక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

శ్రీవారికి విశేష పూజలు


వెలుగొండలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు


రేగడపల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు

కొనకనమిట్ల: కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా బుధవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే వాగుమడుగు పంచాయతీ రేగడపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

టంగుటూరు మండలానికి సాగర్ జలాలు


మర్లపాడులో లోతు కుంటకు చేరుతున్న సాగర్ నీరు

టంగుటూరు: టంగుటూరు మండలంలోని కందులూరు, మర్లపాడు, మల్లవరప్పాడు, తూర్పునాయుడుపాలెం, వల్లూరు గ్రామాలకు 60 క్యూసెక్కుల సాగర్ జలాలు వచ్చాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు బుధవారం తెలిపారు. ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలను సాగర్ జలాలతో నింపుతున్నామని పేర్కొన్నారు.

మర్లపాడు గ్రామంలో లోతు కుంటను సాగర్ నీటితో నింపడాన్ని సర్పంచి తాళ్లూరి ఆశీర్వాదం పర్యవేక్షించారు.